ఉగాది కథల పోటీలో రూ. 600/- బహుమతి పొందిన కథ

# అసిధారావ్రతం

దశిక రాజ్యలక్ష్మి

సాయంత్రం అరున్నర దాటింది. వంటా వార్పూ ముగించింది జానకి. కిచెన్ లోంచి బైటపడేసరికి ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయినట్లుగా వుంది. కంపరంగా వుంది. పది నిముషాల్లో స్నానం ముగించి మరో చీర కట్టుకుని జడల్లుకుంటూ డాబా మీదికి వెళ్ళి, పిట్టగోడకి ఆనుకుని నిలబడింది.

వైశాఖ పున్నమి దగ్గిర పడుతోందేమో, వెన్నెల చుట్టూ పరుచుకుంది - పాదరసం ఒలికినట్లు.

పెద్దవాడు ప్రభాకరం, చిన్నాడు విశ్వం ఆఫీసుల్నుండి పెందరాళే వచ్చి స్నానాలూ గట్రా కానిచ్చి ఊళ్ళో బలాదూరుకు వెళ్ళిపోయేరు. ఆయనగారు సరేసరి! ఆఫీసు అయిదు గంటలకే అయిపోయినా రాత్రి పదకొండయితే గానీ కొంప ముఖం చూడరు. అది ఆయనకి అలవాటు. ఇక వసంత, బి.ఎస్సీ థర్డ్ ఏడు గట్టెక్కడానికి దానికా అదృష్టం కలిసి రాలేదు. ప్రస్తుతం టైపూ, షార్టు హాండూ నేర్చుకుంటోంది. రోజూ అయిదున్నరకి వెళ్ళి ఏ ఎనిమిదింటికో వస్తుంది. ఏ వ్యాపకం లేకుండా, స్కూలు నుంచి అయిదింటికల్లా వచ్చి, ఇల్లు పట్టుకు వేళ్ళాడుతూ వుండేది తనొక్కర్తే! ఒకప్పుడేవేవో అభిరుచులు తనకూ ఉన్నట్లే గుర్తు. కానీ, ఇప్పుడవేవీ లేవు. ఉన్నా నెరవేరే అవకాశాలూ రావు. బహుశ తను ఒక యంత్రంలా తయారవడం, మనసొక బండరాయిలా మారడం కారణం కావచ్చు. ఏమీ తోచకపోతే పాత వారపత్రిక పట్టుకుని డాబా మీదికి చేరడం, చదవడానికి మనస్కరించకపోతే వెన్నెలనో, చీకటినో చూస్తూ కాలం గడపడం అలవాటు చేసుకుంది. తనూ సంపాదిస్తోంది. అయినా ఇంటికి సంబంధించిన అన్ని బాధ్యతలూ మోస్తోంది. గాడిద చాకిరీ చేస్తోంది. ఇంట్లో ప్రతి ఒక్కరి సమస్యకీ స్పందిస్తుంది. అందరికీ సానుభూతి చూపిస్తోంది. సహకరిస్తోంది. కాని ఎవ్వరూ 'తన' గురించి పట్టించుకోరు. అడగరు.

ఏవిఁటీ సంసారం? ఏం మనుషులు వీళ్లు? కట్టుకున్న మొగుడూ, కన్న కొడుకులూ ఒకలాగే ఉన్నారు. కాకపోతే కూతురు వసంత - తనూ ఆడదే గనక అప్పుడప్పుడు, తన యాంత్రిక జీవితాన్ని తల్చుకుని బాధపడుతూ వుంటుంది. భవిష్యత్తులో తనకూ అలాంటి పరిస్థితి కలగబోతోందన్న ఆలోచన కలిగి, అలా బాధపడుతూ వుంటుందేమో!

జానకి భారంగా నిట్టూర్చింది.

ఆమె మనఃస్థితి ఎప్పుడూ అంతే! ఎన్నో రకాలుగా, ఎన్నెన్నో సమస్యల చుట్టూ పరిభ్రమిస్తూ వుండటం, చుట్టూ తిరిగి తన దగ్గిరికే వచ్చి ఆగిపోవడం మామూలైపోయింది. ఏ విధంగానూ సంతృప్తి కలిగించని తన రొటీన్ జీవిత విధానాన్ని పూర్తిగా అసహ్యించుకోవడం యిష్టం లేక, 'ఆశించే దానికీ, లభించే దానికీ పొంతన వుండకపోవడం సహజం' అని సరిపెట్టుకుని ఓ నిట్టూర్పు విడుస్తూ వుంటుంది జానకి.

ఆలోచనల్లో పడిపోయి, ఎన్నిమార్లు జడ అల్లిందో, ఎన్నిమార్లు విప్పిందో గుర్తించకుండా చాలాసేపు గడిపింది జానకి, అక్కడే నిలబడి.

కింది నుండి కాలింగ్ బెల్ అదే పనిగా మోగుతోంది.

ఎంతసేపట్నుంచి మోగుతోందో ఏమిటో అనుకుంటూ గబగబ మెట్లు దిగి వెళ్ళి వీధి తలుపు తీసింది జానకి.

ఎదురుగా ప్రసన్న ఎంతో ప్రసన్నంగా, ప్రశాంతంగా మూర్తీభవించిన సంతృప్తిలాగా నిలబడి వుంది. ఆమె పెదవుల మీద ఎప్పటిమాదిరే చెరిగిపోని చిరునవ్వు.

"ఏడవకుండానే తలుపులు బిడాయించుకుని ఏం చేస్తున్నావే జానీ?" అని ప్రశ్నిస్తూ లోపలికి చొరబడింది ప్రసన్న.

"ఏడవడం లేదులే!" అని సన్నగా నవ్వి, "అందరూ వూరిని ఉద్ధరిస్తుంటే నేను వంటింటి రాచకార్యాలు చూస్తున్నాను. జెస్ట్ రిలాక్స్ అవుదామని ఇప్పుడే డాబా మీదికి చేరాను. అంతే!" అంది జానకి, తలుపు గడియ బిగించింది.

ఇద్దరూ హాల్లో వున్న కుర్చీల్లో ఎదురెదురుగా కూర్చున్నారు. మెర్క్యురీ లైటు కాంతిలో రెండు మూడు క్షణాలు ఒకరినొకరు పరిశీలనగా చూసుకున్నారు.

"కాస్త కాఫీ కలిపి యిస్తాను!" అంది జానకి లేవబోతూ.

"ఆగాగు! మరోసారి కాఫీ పేరెత్తావా, పారిపోతాను జాగ్రత్త! కాస్సేపు కబుర్లు చెప్పుకోవచ్చని నేనొస్తే, నువ్వేవిఁటే మధ్యలో కాఫీ గీఫీ అంటావు?" అన్నది ప్రసన్న.

"మీ ఆయనా నువ్వూ చెప్పుకునే కబుర్లకి కొదవ వచ్చిందా ఏవిఁటి ప్రసన్నా? అయినా నేను నీకు కబుర్లేం చెబుతానే నీ మొహం? నేనెప్పుడన్నా ఇల్లూ, స్కూలు తప్ప వేరే ప్రపంచం ఏం చూశాను గనుక?" అన్నది జానకి భారంగా.

అనుకోకుండానే వాతావరణం బరువెక్కినట్లు గ్రహించింది ప్రసన్న. తను యథాలాపంగా అన్న మాట జానకి మనస్సుకి అంత సూటిగా తగులుతుందని ప్రసన్న ఊహించలేదు.

జానకి పరిస్థితి తలపుల్లో మెదిలీ మెదలగానే జాలేసిందామెకి. పాతికేళ్ళనాడు... ఒకటి రెండు నెలల తేడాగా తనకీ జానకికీ పెళ్ళిళ్ళయ్యాయి. దాదాపుగా ఇద్దరి వయసు ఒకటే. నలభై అయిదు. ఇద్దరూ వుద్యోగాలు చేసుకుంటున్నారు. భర్తలూ పెద్ద వుద్యోగస్తులే! సంపాదనకీ, సౌఖ్యవంతమైన జీవితానికి లోటు లేదు. కన్న పిల్లలూ ప్రయోజకులయ్యేరు. నిజానికి అసంతృప్తి అనేది మనసులోకి రాకూడదు. రాకుండా ముందు జాగ్రత్తలన్నీ తీసుకుంది తను. సుఖసంతోషాలనేవి వాటంతట అవే వచ్చి ఎదురుగా నిలబడి 'ఇదుగో చూడు, మేం వచ్చాం! నీ ముందు నిలబడ్డాం! అందుకుంటావా లేదా' అని ఎప్పుడూ అడగవు. జీవితం నుంచీ, పరిస్థితుల నుంచీ, చుట్టూ వున్న ప్రపంచం నుంచీ బలవంతాన లాక్కోవలసిందేనని తను పూర్తిగా నమ్మింది. ఆ నమ్మకానికి తగినట్లే తనని తానే మలుచుకుంది. సుఖం, సంతోషం నిత్య నూతనంగా నేటికీ మిగిలి వుండేలాగా బతుకుని తీర్చి దిద్దుకోగలిగింది. ఇదంతా కేవలం తన ప్రయోజకత్వమేనని తనెప్పుడూ అనుకోలేదు. భర్త అభిరుచీ, సహకారం కూడా తనకి అండగా నిలిచేయి.

మరి జానకి?

ఎక్కడ ఏం లోపం జరిగిందని దాని బతుకిలా నిర్జీవంగా తయారైంది? ఎందుకు. ఏవిఁటి అనే ప్రశ్నలకి అదెప్పుడూ సమాధానాలు చెప్పదు. చెప్పించడం దేవుడి వశం కూడా కాదు. అదంత లోతైన మనిషి.

"ఏవిఁటే ప్రసన్నా ఉన్నట్టుండి ఊహాలోకంలోకి వెళ్ళిపోయావు? ఏదేనా మరపురాని మధుర సన్నివేశం జరిగిందా? నాకూ చెప్పు... విని ఆనందిస్తాను." అన్నది జానకి.

"నా బొంద! అదేం కాదు జానీ! నీతో ఓ ముఖ్య విషయం చెప్పిపోదామని వచ్చానే అసలు! ఎలా చెప్పాలో బోధపడి చావడం లేదు! చెబితే నువ్వు బాధపడతావేమోనన్న పీకులాట! అలాని చెప్పకుండా మనసులో దాచుకోలేకపోతున్నాను!" అన్నది ప్రసన్న.

జానకి ముఖం గంభీరత పులుముకుంది. ప్రసన్న వైపే చూస్తూ మౌనం దాల్చింది.

"నాకు బాధేమిటి ప్రసన్నా! నచ్చినా నచ్చకపోయినా, ఎన్నెన్నో విషయాలు వింటున్నాను. ఇంకెన్నెన్నో సన్నివేశాలు చూస్తున్నాను. నిర్వికారంగా వుండటం నాకు అలవాటైపోయింది. పరవాలేదు కానీ! నేనూ సిద్ధంగానే వున్నాను." అన్నది జానకి కొద్దిసేపటి తరువాత.

"మన వసంత విషయమే జానీ!" అన్నది ప్రసన్న.

"ఏవిఁటది?" అడిగింది జానకి మామూలుగా. ఆమె గొంతులో ఎలాంటి ఆత్రుతగానీ, ఆదుర్దాగానీ లేవు.

"ఆ టైప్ ఇన్‌స్టిట్యూట్ నడిపే కుర్రాడున్నాడు గదా, రాంబాబు, అతగాడితో చాలా చనువుగా వుంటోంది. ఒకటి రెండు మార్లు సినిమా హాల్లో కూడా ఈయనగారి కంటపడ్డారట! అఫ్‌కోర్స్ వాళ్ళేయన్ని చూళ్ళేదటలే!"

"మీ ఆయన చూసి వూరుకున్నాడా?"

"ఆయన మాత్రం ఏం చేస్తారే? డిగ్రీదాకా చదివిన పిల్ల! మంచేదో చెడేదో దానికి తెలీదా? ఉండబట్టలేక ఒకవేళ ఏమన్నా అంటే... కుర్రతనం గదా, నీకెందుకు అంకుల్ అంటుందేమో అని జడిశార్ట! మనసులో దాచుకోలేక నా చెవిన వేశారు. నే వెళ్ళి ఆ కుర్రాణ్ణి గురించి వాకబు చేశాను. మన కులంగాడు! పైగా ఆ ఇన్‌స్టిట్యూట్ తప్పించి మరో ఆధారం లేదు."

జానకి ఏమీ మాట్లాడలేదు. ఎటో చూస్తోంది.




"ఓ ఏడాది కిందటి దాకా అతగాడు సకల గుణాభిరాముడూనట! సిగరెట్లు, తాగుడు, పేకాట అన్నీ వుండేవట. కాని ఉన్నట్టుండి అన్నీ వదిలేశాడట! ఏ మహర్షి ఆవేశించాడో మరి! ఈ సంగతి వాడి స్నేహితులే చెప్పారు!" అన్నది ప్రసన్న జానకినే సూటిగా చూస్తూ.

జానకి సన్నగా నవ్వింది.

"మా వసంత స్నేహం అలా మార్చిందేమోనే అతగాణ్ణి? సృష్టిలో తియ్యనిది స్నేహమేనోయి అన్నా రెవరో!" అన్నది జానకి తాపీగా. ప్రసన్న తెల్ల బోయింది. పిడుగులాంటి వార్త చెబితే చలించ కుండా నిమ్మకి నీరెత్తినట్లు ఎలా వుండగలుగుతోంది ఈ మనిషి?

జానకి తత్వం అర్థంగాకుండా పోయింది.

"నీకు భయం, కంగారు లాంటివేమీ లేవా జానీ?" అనడిగింది ప్రసన్న.

"కొత్తగా విన్నదైతే నాకా ఫీలింగ్స్ కలిగేవేమో మరి! కాని ఇప్పుడలా కాదుగా ప్రసన్నా! పాతబడి పోయింది. నాకు తెలిసి నెల రోజులు దాటిపోయింది. ఆ మధ్యన వసంతకో సంబంధం వచ్చింది, తెలుసుగా! వాళ్ళు పిల్ల నచ్చిందన్నారు. ముహూర్తం పెట్టి కబురు చెయ్యమని ఉత్తరం రాశారు. ఆ రోజు రాత్రే వసంత తన డైరీ తెచ్చి నాకిచ్చి చదవమంది - నోటితో ఏమీ చెప్పకుండా! చదివేను. అందులో వున్న అక్షరాల్లో దాని మనసేవిటో స్పష్టంగా కనిపించింది. నేనేం చేసేది చెప్పు! అసలు విషయం చెప్పకుండా, ఆయనతో దానికి యిష్టంలేదన్నాను. ఆయనగారిక్కూడా, వాళ్ళడిగిన కట్నం ఎక్కువగా అనిపించినట్టుంది, ఇంటిని యుద్ధరంగం చెయ్యకుండా వూరుకున్నారు. అప్పటికి ఆ గండం గడిచింది. ఇకముందేం జరుగుతుందో మరి?" అన్నది జానకి.

ప్రసన్నకి అంతా ఆశ్చర్యంగా వుంది.

"జానీ! ఒక్క మాట అడగనా?" అంది.

"నా దగ్గిర మొహమాటం దేనికే? అడుగు!" అన్నది జానకి.

"ఈ విషయంలో నీ అభిప్రాయం ఏవిటే అసలు?" అని ప్రశ్నించింది.

"నా అభిప్రాయం ఎవరిక్కావాలి ప్రసన్నా! ఎవ్వరికీ అక్కర్లేదు. కనక ఎవరూ అడగరు! చిన్ననాటి స్నేహితురాలివి కాబట్టి నీకు తెలుసుకోవాలనిపించింది!" అన్నది జానకి రుద్ధకంఠంతో.

"అవును. బాధపడ్డంమాని, నీ మనసులో ఏముందో చెప్పవే! నా చేతనైన సాయం చేస్తాను!" హామీ యిచ్చింది ప్రసన్న జానకి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"నాకు ఓ మనసు! దాన్లో ఓ మాట! ఏం డైలాగులే ప్రసన్నా యివి? ఏనాడో చచ్చిన నా మనసులో మాటలు కూడానా? ప్రస్తుతానికి అలాంటివేం లేవు! అనవసర మైన అనుమానాలు పెట్టుకుని బుర్రపాడు చేసుకోకు! పద, కిచెన్‌లోకి వెడదాం! నీకు యిష్టం లేకపోయినా నా తృప్తికోసం రెండు చుక్కలు కాఫీ తాగుదువు గాని!" అంటూ లేచింది జానకి. అయోమయంగా అనుసరించింది ప్రసన్న

* * *

ఉదయం పదకొండు అవుతోంది.

టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోకి నడిచింది జానకి.

ముందు గదిలో టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని కాగితాలేవో చూసుకుంటున్న యువకుడు తలెత్తి చూసేడు. మరుక్షణం స్ప్రింగ్‌లాలేచి నిలబడి రెండు చేతులూ జోడించాడు.

"రాంబాబు అంటే...?" అని ఆగింది జానకి అర్థోక్తిలో.

"నేనేనండీ! మీరు నాతో మాట్లాడాలని వచ్చారని నాకు తెలుసు. ఏదో ఓ రోజు మీరొస్తారని ఎదురు చూస్తున్నాను. రండి! లోపలి గదిలో కూర్చుందాం. డిస్టర్బెన్స్ వుండదు!" అంటూ రాంబాబు ఆమె సమాధానానికి ఎదురు చూడకుండా ఎదురుగా వున్న రూంలోకి దారి తీశాడు. వెనకే వెళ్ళింది జానకి.

రాంబాబుది భారీ విగ్రహం. బాగా పొడుగ్గా వున్నాడు. ఆకర్షణీయమైన రూపం. మంచి కంఠస్వరం. అతని కదలికల్లో ఓ రకమైన హుందాతనం కనిపిస్తోంది.

"కూర్చోండి ఆంటీ?" కుర్చీ చూపేడు రాంబాబు.

జానకి నిస్సంకోచంగా కూర్చుంది అతన్నే చూస్తూ.

"మీరు కాఫీ తీసుకుంటారా? కూల్ డ్రింకేదైనా తెప్పించమంటారా?" అని ప్రశ్నించాడు రాంబాబు.

"నాకేమీ అక్కర్లేదయ్యా! ఓ పదినిముషాలు నీతో మాట్లాడదామని వచ్చాను. నువ్వలా కూర్చోముందు?" అన్నది జానకి.

జానకి కంఠంలో తొంగి చూచిన గాంభీర్యం అతన్ని తక్షణం కూర్చోబెట్టింది. కొన్ని క్షణాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"చెప్పండి ఆంటీ!" అన్నాడు రాంబాబు.

"టైప్‌లో ఇక్కడ చేరిన అందమైన ఆడపిల్లల్ని వలలో వేసుకోడం అలవాటా నీకు?" అనడిగింది జానకి చాలా కటువుగా.

క్షణకాలం తెల్లబోయినా, తే వెంటనే గల గల నవ్వేశాడు రాంబాబు.

"ఆంటీ! వయసులో, జీవితానుభవంలో మీరు చాలా పెద్ద వారు. నేను మీ బిడ్డలాంటి వాణ్ణి. మీకు వివరించేటంత తెలివైన వాణ్ణి కూడా కాదు - నేను. అయినా మీరడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పడం నా బాధ్యత. ఎందుకంటే మీరు నా కేరక్టర్‌కి సవాలు విసిరేరు. నా పట్ల మీలో ఏదో దురభిప్రాయం వున్నట్లు నా కర్థమైంది. కారణం, బహుశ ఓ ఏడాది కిందటి రాంబాబుని గురించి విని వుండటమేనేమో! ఇప్పుడు నేను ఆనాటి వాణ్ణి కాను అని బుజువు చేసుకోగలను. కాని ఆనాటి మచ్చని చెరిపేసుకోలేను. ఎవరైనా సరే గతకాలపు కళంకాల నీడలు భవిష్యత్తు మీద పడకుండా ప్రయత్నించగలరు కాని, అసలు వాటిని చెరిపేసుకోలేరు - పూర్తిగా. ఇది మీకు తెలీని సత్యం కాదు. పోతే, అందానికి మీ నిర్వచనం ఏవిఁటో నేనెరగను. నా దృష్టిలో కేవలం అది బాహ్యారూపం యొక్క ఆకర్షణ మాత్రం కాదు. ఇంకేదో! కన్ను చూడలేనిది, ఊహ అందుకోలేనిది, మనసు మాత్రమే అనుభవించగలిగేది మరేదో అనిపిస్తుంది నాకు. అలాంటి సౌందర్యం ఏదో నేను వసంతలో చూడగలిగేను ఆంటీ! మొట్టమొదటి సారిగా వసంతని చూసినప్పుడు ఈ దేవత నా కోసమే పుట్టిందేమో అనిపించింది. నన్ను ఉద్ధరించడానికి సాక్షాత్కరించిందేమో అన్న నమ్మకం కలిగింది. ఆమెలోని క్షమాగుణం నన్ను నిలువెల్లా కదిలించేసింది. నా మనస్సుని కల్లోలం చేసేసింది. ఆమె ముందు నా జీవితంలోని ఏ రహస్యాన్నీ ఏ కళంకాన్నీ దాచుకోడం పాపం అనిపించింది. అన్నీ విప్పి చెప్పాను. సముద్రమంత విశాలమైన మనసుతో నన్ను క్షమించింది. నన్ను మనిషిని చేసింది. వసంతకి నేను వలవెయ్యడం ఏవిఁటి ఆంటీ? వసంత హృదయ సౌందర్యాగ్నిలో పడి గిలగిల లాడుతున్న వాణ్ణి నేను. ఆమె నాకు దక్కకపోతే.... ఈ జీవితం ముగించుకోడానిక్కూడా నేను వెనకాడను ఆంటీ! ఈ విషయం మీకు చెప్పే అవకాశం యిచ్చినందుకు మీకు చాలా ఋణపడ్డాను. అటుపైన మీ యిష్టం!" అన్నాడు రాంబాబు.

మనుమలు ఇలా కూడా మాట్లాడతారన్న నిజం మొట్టమొదటిసారిగా గ్రహించింది జానకి. ఎక్కడిదా వాక్ప్రవాహం? ఏ ప్రణయ జలపాతం నుంచీ ప్రవహిస్తోంది? ఇంత శక్తివంతంగా వుంటుందా అసలు? ఎక్కడో హృదయాంతర్గత అంధకార కుహరాల్లో అణిగిపోయిన అనుభూతుల్ని నిద్రాణావస్థ నుండి ఇలా జాగృతం చేస్తుందా? తనే ఇంతగా కదిలి, కరిగిపోతుంటే వసంత ఎలా నిగ్రహించుకోగలుగుతుంది, పిచ్చిపిల్ల? అప్రయత్నంగా జానకి కళ్ళు తడవుతున్నాయి. తల తిప్పుకుని పైట కొంగుతో నలకపడ్డట్టు తుడుచుకుంది.

"ఆంటీ! మీకు మరో విషయం చెప్పాలి! మా అమ్మ చాలా దారుణ పరిస్థితుల్లో జన్మ యిచ్చింది. తరతరాలుగా మగాడి దౌర్జన్యానికీ, మోసానికీ బలైపోతున్న లక్షల మంది తల్లుల్లో అమ్మకూడా ఓ నిర్భాగ్యురాలు! కాని నా కన్న తల్లి! నా కోసం బతికింది. నన్నింత వాణ్ణి చేసింది. నా బంగారు భవితవ్యం గురించి కలలుకంటూ జీవచ్ఛవంలా బతుకుతోంది. అందరూ ఆమెని పతిత అంటారు. కాని ఆమె నా కన్న తల్లి. నా కన్న తల్లి కథవిని కన్నీళ్ళు పెట్టుకుని, ఆవిణ్ణి గౌరవించగలిగిన వసంతని నేను దేవతగా ఆరాధించకుండా ఎలా వుండమంటారు ఆంటీ! మీరే చెప్పండి! స్త్రీగా ఆలోచించి చెప్పండి!" అన్నాడు రాంబాబు గద్గదికంగా.

— 'వసంతా! నా తల్లీ! ఎంతగా ఎదిగిపోయావే నువ్వు? కూతురివైపోయావుగాని నీ పాదాలకి నమస్కరించాలని వుందమ్మా నాకు' — జానకి మనస్సు పులకరించిపోతోంది.

ప్రేమాభిమానాలకీ, మానవత్వానికీ సరిహద్దులు ఎక్కడివి? అన్ని అగడ్తలనూ దాటి, మహోన్నత పర్వత శిఖరాలనూ దాటి విశ్వవ్యాప్తమై పోతాయి. ఏ శక్తులు వాటిని ఆపగలవు?

"వస్తాను బాబూ!" అని లేచింది జానకి.

రాంబాబు లేచి నిలబడ్డాడు. చేతులు జోడించాడు.

"పాపులను గాక, పాపాలను ద్వేషించే మహామహులు ఈ లోకంలో నూటికీ కోటికీ పుడుతూవుంటారు ఆంటీ! వసంత వారి విశాలత్వాన్ని వారసత్వంగా పొందింది. నా జీవితపుఎడారిలో ఒయాసిస్సు వసంత. ఆ ప్రణయామృత సరస్సులో దాహం తీర్చుకుని పునీతుడినయ్యే అవకాశం యివ్వండి ఆంటీ!" అన్నాడు రాంబాబు.

జానకి నెమ్మదిగా, భారంగా బైటికి నడిచింది.

రాంబాబు కళ్ళార్పకుండా చూస్తూ నిలబడ్డాడు.

* * *

కాంతారావు సింహంలా గర్జించాడు.

"ఎక్కడి నుంచీ వస్తున్నావే? ఆ దిక్కుమాలిన దాని వర్ణ సంకరం పెళ్ళి కన్నులపండగ్గా చూసి, అక్షింతలేసి, ఆశీర్వదించి వచ్చావా?" అనరిచాడు.

జానకి, దించుకున్న తలను చివ్వున పైకెత్తింది. ప్రభాకరం, విశ్వంలకు మధ్యలో నిలబడి వున్నాడు భర్త కాంతారావు. జానకి రెండు మూడు క్షణాలు మౌనంగా వుండిపోయింది.

"చెప్పవే!" మళ్ళీ అరిచాడు కాంతారావు.

"ఆ పెళ్ళికి మీరే పేరు పెట్టినా, నేను మాత్రం వారి ప్రేమ వివాహానికే వెళ్ళొస్తున్నాను. మనస్ఫూర్తిగా ఆశీర్వదించే వచ్చాను. భార్యగా, భర్త శరీరంలో, జీవితంలో, కష్ట సుఖాల్లో, సగభాగం పంచుకుంటూ, నీ హక్కులు నువ్వు కాపాడుకుంటూ, నీ ఆత్మ గౌరవాన్ని పోగొట్టుకోకుండా, ఆధునిక స్త్రీలా స్వతంత్ర భావాలతో కలకాలం హాయిగా వుండమ్మా - అని ఆశీర్వదించాను!" అంది జానకి.

"అవన్నీ నీకిక్కడ లేవనేనా నీ బాధంతా? అందుకేనా ఈ పెళ్ళిని తెరచాటు నుంచీ జరిపించావ్?"

"అవును! లేవు! ఈ నిజం ఇన్నాళ్ళకైనా మీ నోటి నుండి వచ్చింది, సంతోషం! మీరు చెప్పండి, గుండెల మీద చెయ్యేసుకుని చెప్పండి, ఇన్నేళ్ళ మన సంసార జీవితంలో ఏనాడైనా మీరు నన్ను మీ భార్యగా చూశారా? భార్యకివ్వాల్సిన కనీసపు స్వేచ్ఛ, రవ్వంత అధికారం, పిసరంత హక్కు యిచ్చారా? లేదు! ఒక బానిసలా చూశారు! పిల్లల్ని కనే యంత్రంగా, ఓ పనిమనిషి, మీ యింటికి కాపలా కుక్కలా చూశారు! ఏ అనుభూతులూ, స్పందనలూ లేని జడపదార్థంలా చూశారు. ఇలాంటి దౌర్భాగ్యపు బ్రతుకు నా ఒక్కగానొక్క ఆడపిల్లకి రాకూడదని, రానివ్వకూడదని ఎన్నో ఏళ్ళుగా కలలు కంటూ బతుకుతున్నాను. ఇప్పటికి ఆ అవకాశం వచ్చింది. ప్రేమించి, ప్రాణాధికంగా ప్రేమింపబడే భాగస్వామి దొరికాడు. కన్న తల్లిగా... ఒక స్త్రీగా నేను ఆశీర్వదించడం తప్పా? మీరు మగాళ్ళు గనక అది మీకు తప్పుగా తోస్తూ వుండొచ్చు! కాని అలాంటి వూహ మానవత్వానికీ, నాగరికతకీ కళంకం!" అంది జానకి తీవ్రమైన ఆవేశంతో.

కాంతారావు నిర్ఘాంతపోయాడు.

మొట్ట మొదటిసారిగా ప్రభాకరం, విశ్వం మెరిసే కళ్ళతో కొత్తగా కనిపిస్తున్న తల్లి వైపు చూస్తున్నారు.

జానకి విజయగర్వంతో లోపలికి నడుస్తోంది.

ఆమె అడుగుల చప్పుడు కాంతారావు గుండెల్లో దుర్భరంగా ప్రతిధ్వనిస్తోంది.

## జాతీయ అవార్డు పొందిన



## కె. సుగుణ మణీదేవి

ఆంధ్రమహిళా సభ అధ్యక్షురాలయిన శ్రీమతి కె. సుగుణమణీ సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అభివృద్ధికీ, ముఖ్యంగా స్త్రీ, శిశు సంక్షేమం కోసం చాలా కృషి చేశారు. ప్రభుత్వం వారు ఇచ్చే గౌరవ అవార్డు ""నేషనల్ అవార్డ్ ఫర్ వుమన్ అండ్ చైల్డ్ వెల్‌ఫేర్" *1991* వ సంవత్సరానికి శ్రీమతి కె. సుగుణమణీగారికి రావటం వల్ల ఆ అవార్డ్‌కి మరింత వన్నె చేకూరింది.

*1919 లో, కాకినాడలో జన్మించిన శ్రీమతి సుగుణమణీ* రఘుపతిరత్నం నాయుడుగారి శిష్యరికంలో, తండ్రిగారి ప్రభావం, ఆశీస్సులు, భర్త శ్రీ భూషణం గారి సహకార ప్రోత్సాహాలతో సంఘసేవ ప్రారంభించారు.

*1941 నుంచీ శ్రీమతి సుగుణమణీ శ్రీమతి దుర్గా* బాయ్ దేష్‌ముఖ్ గారితో కలిసి అనేక సాంఘిక కార్య కలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. భారతస్వాతంత్ర్య సమరంలో కూడా ఈమె పాల్గొన్నారు.

*50 సంవత్సరాలు* నిర్విరామంగా సేవ చేసిన ఘనత శ్రీమతి సుగుణమణీగారిదే. ఆంధ్ర మహిళా సభలో హైస్కూల్, కాలేజ్ ఆధునిక పరికరాలతో కూడుకున్న హాస్పిటల్, లిటరసీ హౌస్, డిగ్రీ కాలేజీ, వర్కింగ్ వుమెన్స్ హాస్టల్, ట్రైనింగ్ ఫర్ ఫిజికల్లీ హాండీ కాప్డ్, మెంటల్లీ రిటార్డెడ్‌లకి తోడుగా ప్రీలీగల్ ఎయిడ్, లా కాలేజ్, హోం ఫర్ ది ఏజ్డ్ కూడా ప్రవేశపెట్టిన ఘనత ఆమెకే దక్కింది.

*72* సంవత్సరాల ఈ వయసులో కూడా ఆమె ఎంతో చలాకీగా తాము నిర్వహిస్తున్న విద్యాలయాలన్నిటినీ ప్రతిరోజూ పర్యవేక్షిస్తుంటారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా, చిరునవ్వుతో అందరితోనూ కలిసి మెలిసి ఆమె పనిచెయ్యటం వల్లనే శ్రీమతి సుగుణమణీగారంటే అందరికీ ఎంతో గౌరవం అభిమానం.

కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ సోషల్ వెల్‌ఫేర్ బోర్డ్ అవార్డ్, శిరోమణీ యిన్‌స్టిట్యూట్ వారి 'వికాశ శ్రీ అవార్డ్' ఈమెకు లభించిన అవార్డులలో కొన్ని.

"ఈ అవార్డు మనందరిదీ. నా వొక్కదానిదే కాదు. ఈ ప్రోత్సాహంతో మనందరం కలిసి ఇంకా ఎన్నో సాధించాలి. స్త్రీ శిశు సంక్షేమానికి ఇంకా ఎంతో చెయ్యాలి. ఇదంతా దుర్గాబాయమ్మగారి చలవే" అంటారు సుగుణమణీదేవి.

యిబ్రహీం పట్నం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ లలో కూడా ఈమె సేవా కేంద్రాలు స్థాపించి, మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారు.

-వి. శ్రీలక్ష్మి